TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 146   ఆదివారం 19-01-2025   పేజీలు :06   వేల : 05/-

## సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రితో సీఎం రేవంత్ బృందం భేటీ





▷తెలంగాణకు సంపూర్ణ సహకారం అందిస్తామన్న సింగపూర్ మంత్రి

**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 18 :** సింగపూర్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హై యిన్‌తో భేటీ అయింది. తెలంగాణతో వివిధ రంగాలలో సింగపూర్? ప్రభుత్వ భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చలు జరిపారు.ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు.తెలంగాణలకు పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. ప్రధానంగా నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, స్పోర్ట్స్, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఉన్న అనుకూలతలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిర వృద్ధి ప్రణాళికలపై ఎక్కువ ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు. ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను గుర్తించాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవాలని, దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణలో సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టుల కార్యాచరణ వేగవంతం చేయాలని నిర్ణయించారు.సెమీకండక్టర్ల పెట్టుబడులపై మరో ముందడుగు...

2లో

## జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ విధానం అమలు చేయాలి

◈ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి



**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 18 :** మీడియా రంగంలో పనిచేసి పదవీ విరమణ పొందిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ విధానం అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలు జర్నలిస్టు సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే)జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్ తదితరులు శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. మీడియా రంగంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పాత్రికేయులకు వృద్ధాప్యంలో ఎటువంటి సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి జర్నలిస్టుల కోసం పెన్షన్ స్కీం అమలు చేస్తామని గతంలో కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి స్వర్గీయ సుష్మాస్వరాజ్ హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. జర్నలిస్టులకు ఒకే విధమైన జాతీయ పెన్షన్ స్కీం అమలు చేయాలన్న డిమాండ్ దేశవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల నుంచి వస్తున్నదని అన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల రైల్వే పాస్ లు, ప్రత్యేక రక్షణ చట్టం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు వంటి పలు సమస్యలను వారు ప్రస్తావిస్తూ, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రిని కోరారు.

2లో

## నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవాలకు రండి

→దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



**ఆదిలాబాద్ (మన వెలుగు) జనవరి 18 :** జిల్లా ఖేస్లాపూర్ లో నిర్వహించనున్న నాగోబా జాతరకు, నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో చేపట్టనున్న వసంత పంచమి ఉత్సవాలకు రావాలని కోరుతూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖను దేవాదాయ శాఖ ఆహ్వానించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, బాసర ఆలయ ఇంఛార్జి కార్యనిర్వహణాధికారి ఎన్. నవీన్ కుమార్, సహాయ కార్యనిర్వహణాధికారి ఆర్. సుదర్శన్, వేదపండితులు మంత్రిని హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవ ఆహ్వాన పత్రికను మంత్రికి అందించి, వేడుకలకు ఆహ్వానించారు.జనవరి 28 నుంచి 31 వరకు నాగోబా జాతరను, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు వసంత పంచమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవ ఆహ్వానపత్రికను మంత్రికి చదివి వినిపించారు. వేదపండితులు మంత్రికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేషవస్త్రాలను అందించి, వేదాశీర్వచనం చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులతో కలిసి మంత్రి సురేఖ బాసర జ్ఞాన సరస్వతి వసంత పంచమి ఉత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు శ్రీ నవీన్ శర్మ, సంజయ్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## దాశరథి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి



**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 18 :**తెలంగాణ సాయుధ పోరాటానికి జవసత్వాలు నింపిన ప్రజాకవి, పీడనపై అగ్నిధారను కురిపించిన కలం యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. హైదరాబాద్ లోని ఒక ప్రముఖ కూడలిలో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకోవాలని కోరారు. దాశరథి జన్మించిన మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో స్మృతి వనం ఏర్పాటు చేయడంతో పాటు గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న దాశరథి గ్రంథాలయానికి ప్రభుత్వం నూతన భవనం నిర్మించాలని ప్రతిపాదించారు. దాశరథి సమగ్ర సాహిత్యాన్ని ప్రభుత్వమే ముద్రించి లైబ్రెరీలలో ఉంచడంతో పాటు అందరికీ అందుబాటులోకి తేవాలని సూచించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం పక్షాన అధికారికంగా సంవత్సరం పొడవునా నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించి ఉన్నదని, కానీ ఆ దిశగా పెద్దగా కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవని ఎండగట్టారు. దాశరథి శత జయంతి సంవత్సరం సందర్భంగా సంవత్సరం పొడవునా కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా జరపాలని, శతజయంతి ఉత్సవాల ముగింపు వేడుకలను ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పెద్ద ఎత్తున జరపాలని పేర్కొన్నారు. దాశరథిని కారాగారంలో ఉంచిన నిజామాబాద్ జిల్లా పాత జైలును ఇప్పటికే తాను కొంత నిధులను వెచ్చించి దాశరథి స్మారక ప్రాంగణం ఏర్పాటుకు పనులు చేపట్టామని, దానిని అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం నుండి కూడా పూనుకొని మరిన్ని ఏర్పాట్లు, మరమ్మత్తులు చేసి ప్రముఖ పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరారు.

2లో

## రేషన్ కార్డుల విషయంలో కోతలొద్దు

◈ప్రభుత్వ చర్యలతో లక్షలాది మంది నష్టపోతారు

◈ముఖ్యమంత్రి రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

◈అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలని డిమాండ్



**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 18 :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరు పేదలను రేషన్ కార్డులకు దూరం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ఆహార భద్రత కార్డుల (రేషన్ కార్డులు) జారీకి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల వల్ల లక్షలాది మంది లబ్దిదారులు నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

2లో

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



## సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రితో సీఎం రేవంత్ బృందం భేటీ

సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుకూలమైన విధానాలు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆకర్షించాయి.
ఈ భాగస్వామ్యం తెలుగు రాష్ట్రానికి కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, ఆర్థికాభివృద్ధికి సహాయపడే అవకాశం ఉంది. సెమీకండక్టర్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలు భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనున్నాయి. హైదరాబాద్ ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడంలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించనుంది.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సింగపూర్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ)తో ప్రత్యేక రౌండ్ టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఐఏ ఛైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ ఛైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్.చుహ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చర్చల్లో రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమ స్థాపనకు అందుబాటులో ఉన్న అనుకూలమైన పరిస్థితులను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సహకారం ప్రోత్సాహకాలను వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలంగాణ రాష్ట్రం కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానానికి ఎఎస్ఐఏ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. సెమీకండక్టర్ల పరిశ్రమల పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ ఏడాది చివర్లో సింగపూర్ నుంచి తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతారని తెలిపారు.

## రేషన్ కార్డుల విషయంలో కోతలొద్దు

ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి... హరీశ్‌రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం... రేషన్ కార్డులు జారీ చేసే విషయంలో మీ ప్రభుత్వం కోతలు పెడుతూ, పేద ప్రజలను మోసం చేయాలని చూడటం దుర్మార్గం. అభయహస్తం మేనిఫెస్టోలో అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కొందరికే పరిమితం చేసే విధంగా నిబంధనలు రూపొందించి అమలు చేస్తుండటం మోసం చేయడమే. క్షేత్రస్థాయిలో ఎలాంటి అధ్యయనం చేయకుండా, అర్హులైన వారికి ఎగనామం పెట్టే విధంగా ఉన్న నిబంధనలను, మీ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. యావత్ తెలంగాణ ప్రజల తరుపున నిలదీస్తున్నాం. పదేళ్ల నాటి నిబంధనలా....? తెలంగాణ పౌరసరఫరాల శాఖ తేదీ: 12.01.2025 నాడ 2/2196/2025తో ఇచ్చిన ఉత్తర్వుల్లోని నిబంధనలను లక్షలాది మంది నిరుపేదలకు రేషన్ కార్డు దూరం చేసే విధంగా రూపొందించడం శోచనీయం. 11.01.2025 నాడు, తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఇచ్చిన %వీవఎశీ చీశీ.1784/2024 ప్రకారం, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుంటున్నామని స్పష్టం చేశారు. అంతేకాదు, గతంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇచ్చిన 653/1/2014 మరియు పౌరసరఫరాల శాఖ %వీవఎశీ చీశీ. 900/2014లో ఇచ్చిన నిబంధనలను పాటిస్తామని తెలిపారు. పదేండ్ల క్రితం నాటి నిబంధనలను యథాతథంగా ఇప్పుడు అమలు చేయడం అంటే, లక్షల మంది అర్హుల్లో కోతలు విధించడమే. లబ్దిదారులకు మొండి చెయ్యి చూపడమే. ఆదాయం, భూపరిమితిని పెంచింది బీఆర్ఎస్.అక్టోబర్ 10, 2014 నాటికి ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిబంధనలను యథాతథంగా పాటిస్తే, లక్షల మంది నిరుపేదలు రేషన్ కార్డులు పొందేందుకు అనర్హులవుతారాని గుర్తించి, కేసీఆర్ ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేసింది. ఇందులో భాగంగా ఆదాయం, భూపరిమితిలో సడలింపులు చేస్తూ నవంబర్ 28,2014 ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆదాయ పరిమితి గ్రామీణంలో 60వేలు, పట్టణంలో 75వేలు ఉంటే, దాన్ని గ్రామీణంలో లక్షా 50వేలకు, పట్టణంలో 2.50 లక్షలకు పెంచింది. అదే విధంగా భూ పరిమితిని పెంచింది. మాగాణి రెండున్నర ఎకరాలు, మెట్ట 5ఎకరాలుగా ఉన్న పరిమితిని మాగాణి మూడున్నరకు, మెట్ట ఏడున్నర ఎకరాలకు పెంచడం జరిగింది. తద్వారా లక్షల మంది నిరుపేదలకు రేషన్ కార్డు పొందే అర్హతను కేసీఆర్ ప్రభుత్వం కల్పించింది. నిరుపేదలకు రేషన్ కార్డులు రాని దుస్థితి... ఇప్పుడు మీ ప్రభుత్వం, పది సంవత్సరాల క్రితం ఉన్న నిబంధనలో ఎలాంటి మార్పులు చేయకుండా, ఇప్పటికీ అవే ఆదాయ, భూపరిమితుల నిబంధనలతో కొనసాగించడం వల్ల లక్షల కుటుంబాలు రేషన్ కార్డు అర్హత కోల్పోతున్నారు. ఉదాహరణకు 2014లో అంగన్ వాడీల వేతనం రూ.4200 ఉండేది. కేసీఆర్ ప్రభుత్వం మూడు దఫాలుగా పెంచి వారి వేతనాన్ని రూ. 13,650కి చేర్చింది. 2014లో వీరి వార్షికాదాయం 50,400 ఉండగా, పెరిగిన వేతనం ప్రకారం ఇప్పుడు వారి వార్షికాదాయం రూ. 1,63,800. రేషన్ కార్డుల జారీలో 2014 నిబంధనలను అనుసరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రతీ అంగన్ వాడీకి రేషన్ కార్డులు రానట్లే. అదే విధంగా ఆశాలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, చిరు ఉద్యోగులకు మీ ప్రభుత్వ అశాస్త్రీయ నిబంధనల వల్ల రేషన్ కార్డులు రాని దుస్థితి నెలకొంది.

## రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటు

### ▷రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 18 :** రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటుతో పాటు ప్రస్తుతమున్న 97 డిపోలు బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బస్ భవన్ లో శనివారం ఆర్టీసీ బోర్డు సమావేశమైంది. కొత్త డిపోలు, బస్ స్టేషన్ లకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది.మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందని.. అందుకు అనుగుణంగా కొత్త బస్ స్టేషన్ల నిర్మాణంతో పాటు ఉన్నవాటిని విస్తరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఒకవైపు కొత్త బస్సులను కొనుగోలు చేస్తూనే.. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు.బోర్డు అనుమతి లభించిన నూతన డిపోలు, బస్ స్టేషన్లను త్వరతిగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.రాష్ట్రంలో పలు కొత్త బస్ డిపోలు, బస్ స్టేషన్ల నిర్మాణం, బస్ స్టేషన్ల విస్తరణకు ఆర్టీసీ బోర్డు అనుమతి. పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లిలో కొత్త బస్ డిపో కోసం నిర్మాణం కోసం రూ.11.70 కోట్లు కేటాయిస్తూ అనుమతులు . ములుగు జిల్లా ఏటూరునాగారంలో కొత్త బస్ డిపో నిర్మాణం కోసం రూ.6.28 కోట్లు కేటాయిస్తూ అనుమతులు . ములుగు జిల్లా ములుగు లో కొత్త బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 5.11 కోట్లు కేటాయిస్తూ అనుమతులు . సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కొత్త బస్ స్టేషన్ కోసం రూ. 3.75 కోట్లు కేటాయిస్తూ అనుమతులు .ఖమ్మం జిల్లా మధిరలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ.10.00 కోట్లు కేటాయిస్తూ అనుమతులు ములుగు జిల్లా మంగపేటలో కొత్త బస్ స్టేషన్ నిర్మాణానికి రూ. 51.00 లక్షలు కేటాయిస్తూ అనుమతులు, పెద్దపల్లి జిల్లా మంథని బస్ స్టేషన్ విస్తరణ కోసం రూ.95.00 లక్షలు కేటాయిస్తూ అనుమతులు . సూర్యాపేట జిల్లా కోదాడ్ వద్ద ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 17.95 కోట్లు కేటాయిస్తూ అనుమతులు 9. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రాబోయే "సరస్వతి పుష్కరాల" దృష్ట్యా ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి రూ. 3.95 కోట్లు కేటాయిస్తూ ఆర్టీసీ బోర్డు అనుమతులు ఇచ్చింది.

## జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ విధానం అమలు చేయాలి

అదే విధంగా హౌసింగ్ సొసైటీల ప్రభుత్వ స్థలాలు ఇవ్వొద్దని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని వారు గర్తుచేస్తూ, కోర్టు తీర్పు వల్ల జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. జర్నలిస్టులను ఇతర ఉన్నత వర్గాలతో పోలుస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించి కోర్టు తీర్పు నిబంధన నుంచి జర్నలిస్టులకు మినహాయింపు లభించే విధంగా చర్యలు తీసుకుని జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, జర్నలిస్టులకు పెన్షన్ స్కీం అమలు చేసే అంశాన్ని కేంద్ర సమాచార ప్రసారాల మంత్రితో చర్చించి పెన్షన్ స్కీం అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా హౌసింగ్ సొసైటీలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అంశం న్యాయ శాఖ పరిధిలో ఉన్నందున, దీనిపై కేంద్ర న్యాయశాఖ మంత్రితో మాట్లాడతానని మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.

## దాశరథి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి

మహాకవి దాశరథి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని తెలంగాణ తొలి ప్రభుత్వం 2015 నుంచి దాశరథి జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ వచ్చిందని గుర్తు చేశారు. దాంతో పాటు "దాశరథి సాహితీ పురస్కారం"ను ఏర్పాటు చేసి రవీంద్ర భారతి వేదికగా సన్మానించి రూ.1,01,116 నగదును అందిస్తూ రావడం జరిగిందని చెప్పారు. అలాగే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని ఆడిటోరియంకు దాశరథి ఆడిటోరియంగా పేరు పెట్టడంతో పాటు ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు వారి కుమారుడికి గత తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడం జరిగిందని వివరించారు. "తెలంగాణ విముక్తి పోరులో ప్రజల పక్షాన నిలవడమే కాక అనేక రచనా ప్రక్రియలలో సాహితీ సృష్టి చేసిన సృజనకారులు. ఈ నేల అస్మితను ఆకాశమంత ఎత్తున నిలిపిన ఆ మహనీయుని శత జయంతి ఉత్సవాలు తెలంగాణ తన మూలాలను నెమరువేసుకునే చారిత్రక సందర్భం. దాశరథి గారి స్ఫూర్తిని ముందుతరాలకు చాటే దిశగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తమరిని సవినయంగా కోరుతున్నాను." అని స్పష్టం చేశారు. కవిత్వం, నాటికలు, కథలు, యాత్రా చరిత్ర వంటి ప్రక్రియలతో తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన మహాకవి దాశరథి అని కొనియాడారు. అద్భుతమైన సినిమా పాటల రచయితగా జోతలందుకున్న తెలంగాణ బిడ్డ దాశరథి కృష్ణమాచార్య అని, ఆయన శత జయంతి తెలంగాణ ప్రజలందరికీ పెద్ద పండుగ. ఈ శత జయంతి సంవత్సరాన్ని ఘనంగా నిర్వహించడం ప్రభుత్వం విద్యుక్త ధర్మమని ఎమ్మెల్సీ కవిత గుర్తు చేశారు.

## ఉగాది నుంచి గద్దర్ అవార్డుల పంపిణీ

- ◆సినిమా నిర్మాణంలో హైదరాబాదును ప్రపంచ గమ్యస్థానంగా మారుస్తాం
- ◆గద్దర్ సినిమా అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 18 :** ఈ ఏడాది ఉగాది నుంచి గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది, అందుకు తగిన విధంగా కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో అవార్డులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవార్డుల కోసం లోగోతో సహా విధివిధానాలు, నియమ, నిబంధనలపై కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈఅవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని



జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం సూచించారు. కల్చరల్ ఐకాన్ గద్దర్ ప్రతిదీ పెంచేలా అవార్డుల లోగోలు రూపొందించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత పది సంవత్సరాలపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన వారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారు, అవార్డుల పంపిణీ జరగలేదని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే అవార్డులను ప్రతి ఏటా అందజేయాలని నిర్ణయించి గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులు ఈ ఉగాది నుంచి ప్రతి సంవత్సరం ఇవన్నట్టు తెలిపారు. ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందచేస్తారు. గద్దర్ అవార్డుకు సంబంధించి లోగోను కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు, ఎండీ డాక్టర్ హరీశ్, ఈడీ కిషోర్‌బాబు, కమిటీ ఛైర్మన్ బీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.ప్రజాపాలన దరఖాస్తుల పరిస్థితి ఏమిటి...?రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తుల పేరిట 28.12.2023 నుంచి 1.1.2024 వరకు 1.25 కోట్ల దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో సుమారు 10లక్షల మంది పైగా తమకు రేషన్ కార్డులు కావాలని కోరినట్లు సమాచారం. కుల గణన సర్వే ఆధారంగా కాకుండా ఈ దరఖాస్తుల ఆధారంగా రేషన్ కార్డులు మంజూరు చేసి, అత్యధిక పేద వర్గాలకు లబ్ది చేకూర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది బీఆర్ఎస్..నాడు ప్రతిపక్షంలో ఉన్న మీరు బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని గోబెల్స్ ప్రచారం చేసారు. అధికారంలోకి వచ్చాక కూడా వాస్తవాలను తొక్కి పెడుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మరోసారి ఈ లేఖ ద్వారా స్పష్టత ఇస్తున్నాం. 2016-17 నుంచి 2022-23 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం 6,47,479 కొత్త రేషన్ కార్డులను అందజేసింది. ప్రభుత్వంలో ఇప్పుడు మీరే ఉన్నరు, ఈ వివరాలను పౌరసరఫరాల శాఖ నుంచి తెప్పించుకొని చూసుకోవచ్చు. ఇకనైనా ఆ అబద్దపు ప్రచారాన్ని మానుకోవాలని, నిరుపేదలకు ఆసరా అయ్యే రేషన్ కార్డుల్లో కోతలు విధించకుండా అందించాలని కోరుతున్నాం.రేషన్ కార్డులపై సన్నబియ్యం జాడ లేదు..అభయహస్తం మేనిఫెస్టోలో రేషన్ కార్డులపై సన్నబియ్యం సరఫరా చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి 400 రోజులు గడుస్తున్నా అతీగతీ లేదు. మేనిఫెస్టోలో మేము పెట్టక పోయినప్పటికీ రేషన్ కార్డు ద్వారా కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి ఇచ్చే బియ్యంను 4కేజీల నుంచి 6కేజీలకు పెంచడం జరిగింది. కుటుంబానికి 20కేజీలే ఉన్న పరిమితిని ఎత్తివేసి, ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి 6కేజీలు ఇచ్చినం. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టకపోయినా తెలంగాణ ఏర్పడిన ఆరు నెలల్లోనే 1.1.2015 నుంచి మధ్యాహ్న భోజనం, గురుకులాలు, హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేసినం.మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు చేయాలి.ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం, పాలన గాలికి వదిలేయడం మానేసి అహయహస్తం మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ, అర్హులైన వారందరికీ బీపీఎల్ రేషన్ కార్డులు మరియు కొత్త రేషన్ కార్డులు అందించాలని, అన్ని రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా అభివృద్ధి చేసి, రేషన్ డీలర్స్ కు 5వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

## మన వెలుగు నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జనవరి 18 :** ములుగు జిల్లాలోని ఎక్సైంజ్ డిపార్ట్మెంట్ డి.పి.ఈ.ఓ జయశంకర్ భూపాలపల్లి ఇంచార్జ్ వేముల శ్రీనివాస్ మరియు సీఐ సుధీర్ కుమార్ మన వెలుగు తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలుస్తున్న అనేక విషయాలు వెలికి తీసి ప్రజలను మేల్కొల్పాలని మన వెలుగు ఎప్పటికైనా ఇలాగే ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు దినదిన అభివృద్ధి చేరుకోవాలని ఆకాంక్షించారు ఇలాంటి నూతన సంవత్సరాలు ఇంకా ఎన్నో జరుపుకోవాలని కోరుకున్నారు ఈ సందర్భంగా మన వెలుగు రిపోర్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## పరికి చెరువును కాపాడండి హైడ్రా కమీషనర్ రంగనాథ్ కు వినతి

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జనవరి 18 :** కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్ట వెంకటేశ్వర ఆలయం దగ్గర జరిగితున్న కబ్జాల విషయం పై పరిశీలనకు విచ్చేసిన హైడ్రా కమీషనర్ రంగనాథ్ను జగద్గిరిగుట్ట స్థానిక అన్ని పార్టీల నాయకులతో కలిసి పరికి చెరువును కూడా పరిశీలించాలని కొరగా వారు పరికి చెరువును పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా వారు హైడ్రా అదేవిదంగా రెవిన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని సర్వే చేయిస్తామని, చెరువును కబ్జా చేస్తున్న వాళ్ళను వదిలిపెట్టే ప్రసక్తే లేదని కచ్చితంగా జైలుకు పంపిస్తామని,హద్దులు ఏర్పాటు చేస్తామని అన్నారు. అదే విదంగా వచ్చే బుధవారం నాడు పరికి చెరువు అంశం పైన సమావేశం కూడా నిర్వహిస్తామని, దానికి అందరూ సహకరించాలని, పరికి చెరువు పరిరక్షణ కొరకు ఒక గ్రూప్ తయారు చేసి ఎప్పటికప్పుడు చెరువు పూడ్చివేత పై సమాచారం ఇవ్వాలని వారు కోరారు. పరికి చెరువును బాలకృష్ణ అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడని స్థానికులు తెలపగా బాలకృష్ణ కబ్జాచేస్తే కచ్చితంగా అరెస్టు చేస్తామని హెచ్చరించారు.అదే విదంగా జగద్గిరిగుట్ట దేవాలయం స్థలంలో అక్రమంగా నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని,కుల సంఘాల పేరుతో కొందరు డబ్బులు వసులు చెయ్యడం,స్థలాలను అమ్ముకోవడం లాంటివి జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని వాటిపైన కూడా సమగ్ర సమాచారాన్ని సేకరించి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని బాద్యులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్,సిపిఐ నాయకులు యాదగిరి,వంశీ,కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, సాయి పంతుల, ఆంజనేయులు,చారి, మహేష్, అరుణ్,బీజేపీ నాయకులు శేఖర్ యాదవ్,రాజు యాదవ్, సురేష్ రెడ్డి,స్థానిక బస్తి నాయకులు పలువురు పాల్గొన్నారు.



హైడ్రా కమిషనర్తో మాట్లాడుతున్న దృశ్యం

## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ


**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 18 :** జగిత్యాల జిల్లా బుగ్గరం మండలం గోపులాపూర్ గ్రామం లో రోడ్డు భద్రతా మాసం సందర్భంగా శనివారం బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి రోడ్డు భద్రత విషయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తదుపరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాల యం నందు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు.ఈ కార్య క్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బలుమూరి రామారావు, కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి అమీర్,శంకర య్య,మదన్,సనత్ తోపాటు గ్రామస్తులు గ్రామ వి పి ఓ హెడ్ కానిస్టేబుల్ పులి రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి దేవాలయంలో,చర్చిలో, మసీదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



అవగాహనా నిర్వహిస్తున్న దృశ్యం

## నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి

**కూకట్పల్లి (మన వెలుగు) జనవరి18 :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు పేరు ఆచంద్రతారార్కం తెలుగు నేలపై నిలిచే ఉంటుందని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాలు శనివారం కూకట్పల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు ఆయన అభిమానులు వాడ వాడల ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పరిధి వసంత నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తి పతాక తెలుగుజాతి వెలుగు రేఖ నందమూరి తారక రామారావు అని దేశ దేశాలలో ఆయన తెలుగువారికి ఒంటి చేత్తో ఘన కీర్తిని సాధించి పెట్టారని కొనియాడారు. రాజకీయాలకె రాజకీయాలు నేర్పారని రాజకీయాలను పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి సంక్షేమానికి వినియోగించిన మహానుభావుడన్నారు. అటు నటనలోనూ ఇటు రాజకీయములను రారాజుగా వెలుగొందిన రామారావు జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం అన్నారు. అనంతరం నిజాంపేట్ రోడ్ త్రివేణి నగర్ చౌరస్తాలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టిడిపి జనార్ధన్ శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ తో తో కలిసి బండి రమేష్ నివాళులర్పించారు అక్కడ అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారికి ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. అన్న సంతర్పణ చేశారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

## ఆలయంలో కోతుల బెడద భయాందోళనలో భక్తులు

బాసర (మన వెలుగు) జనవరి 18 : శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధిలో వానరాలకు భయపడే పరిస్థితి ఎదురవుతుంది. అక్కడ భద్రత సిబ్బంది ఉన్నప్పటికీ కూడా కోతులు యతేచ్ఛగా గర్భగుడి వద్దకు చొచ్చుకుని రావడం గమనార్హం. అక్షరాభ్యాసం చేసే క్రమంలో కూడా వానరాలు రావడంతో అక్షరాభ్యాసం చేసుకునే చిన్నపిల్లలతో పాటు తల్లిదండ్రులకు కూడా ఇబ్బందిగా మారుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అమ్మవారికి ఒడి బియ్యం నింపే దగ్గర మరియు హుండీలపైన కోతులు ప్రత్యక్షమవుతున్నాయి.గతంలో ఆలయం లోపలే భక్తులపై దాడి చేసిన ఘటనలు లేకపోలేదు. కావున ఇప్పటికైనా ఆలయ సిబ్బంది స్పందించి తగిన చర్యలు తీసుకొని, వచ్చేది వసంత పంచమి కాబట్టి భక్తుల రద్దీ చాలా పెరిగే అవకాశం ఉందని ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని కోతుల భారిన భక్తులను రక్షించాలని భక్తులు కోరుతున్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 18 :** జగిత్యాల అర్బన్ మరియు రూరల్ మండలాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 18 లక్షల రూపాయల విలువగల చెక్కులను 108 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన 1 కోటి 81 వేల రూపాయల విలువగల చెక్కులను జగిత్యాల పట్టణంలో పొన్నాల గార్డెన్స్ లో అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల ను రుణ విముక్తి చేయటానికి తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 21 వేల కోట్ల రుణ మాఫీ అమలు చేయటం జరిగింది.రైతు భరోసా త్వరలో పంపిణీ చేస్తాం. అర్హులైన లబ్ధిదారులకు అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తాం.ప్రజలు ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు లో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు.రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా జగిత్యాల ప్రాంత,నియోజకవర్గ అభివృద్ధి కి కృషి చేస్తాను.అర్హులైన పెదలందరికి ఇందిరమ్మ ఇళ్లు దశల వారీగా మంజూరు చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, ఎమ్మార్వోలు శ్రీనివాస్, రామ్మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్లు కొలుగురి దామోదర్ రావు,నక్కల రవీందర్ రెడ్డి,నాయకులు సురేందర్ రావు,బాల ముకుందం,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులని పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

## వృద్ధుల ఫిర్యాదులపై విచారణ

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 18 :** తమను నిరాదరిస్తున్న కుమారులపై వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ కు జగిత్యాల డివిజన్ పరిధి లోని వివిధ గ్రామాల వృద్ధులు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు ఆర్డీవో అదేశాల మేరకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఏ.ఓ.తఫజుల్ హుస్సేన్ విచారణలు నిర్వహించారు. గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన జేరిపోతుల అంజయ్య,పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి ఉప్పుల లచ్చయ్య,ఎండపల్లి మండలం ముంజం పల్లి గ్రామానికి చెందిన బైరం భూమమ్మ, ఎండపల్లి గ్రామానికి చెందిన బైకని లచ్చవ్వల తదితర , కుమారులను, కూతుర్లను,కోడళ్లను విచారించారు. తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ విచారణకు ముందుగా వృద్ధులైన తల్లిదండ్రులను పోషించకుండా నిర్లక్ష్యం చేస్తున్న వారి కుమారులకు,కోడళ్లకు,కూతుర్లకు,అల్లుళ్ళకు 2007 సంరక్షణ చట్టం,నియమావళి 2011 , సెక్షన్ 24 పై సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆ వృద్ధ తల్లిదండ్రుల పక్షాన ఏ.ఓ.ముందు తన వాదనలు వినిపించారు. ఏ.ఓ.మాట్లాడుతూ ట్రిబ్యునల్ తీర్పులు పాటించని వారిపై ,నోటీసులు ఇచ్చినా హాజరు కానివారిపై చట్టపర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జగిత్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బక్కశెట్టి సాయి దామోదర్ అనే తండ్రిని కొడుతున్న కొడుకు మారుతి, కోడలు గంగవ్వలపై వృద్ధుల సంరక్షణ చట్టం సెక్షన్ 17(1) ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ట్రిబ్యునల్ చైర్మన్ అయిన ఆర్డీవో ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు..ఈ విచారణలో సీనియర్ సిటిజెన్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ఎఫ్.ఆర్.ఓ.కొండయ్య , కౌన్సెలింగ్ అసిస్టెంట్ వెల్ముల ప్రకాష్ రావు, ట్రిబ్యునల్ సెక్షన్ అసిస్టెంట్ పద్మజ , తదితరులున్నారు.



విచారిస్తున్న దృశ్యం

## విశ్వవిద్యాలయం శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన

**శేర్లింగంపల్లి (మనవెలుగు) జనవరి 18 :** శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిర్మల ప్రభాకర్,డైరెక్టర్ కనక దుర్గ నృత్య విభావరి,పాలక మండలి పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది, శ్లోకం, వినాయక స్తోత్రం, లింగాష్టకం, అన్నమాచార్య కీర్తన, అలరులుకురియగా, శబ్దం, ఘంటము పూయరుగా, జతిస్వరం, అయిగిరినందిని అంశాలను సంహిత, సహస్ర, పూర్వి, రితిక, దిత్య, ఆధ్య, కనిష్క, నికిత, నక్షత్ర, ఆరోహి, కృతిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. ప్రముఖ నాట్య గురువులు ఓలేటి రంగమని, నిర్మల విశ్వేశ్వర రావు,జి వెంకట్ రెడ్డి, జివిఆర్ ఫౌండేషన్ చైర్మన్, డాక్టర్ కుసుమ భోగరాజు,కుసుమ కమలరత్నం మెమోరియల్ ట్రస్ట్ వారు అతిథులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



నాట్యాలు చేస్తున్న చిన్నారులు

## కొండాపూర్ ఓయోరూమ్ లో గంజాయి కలకలం

### - గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

**శేర్లింగంపల్లి (మన వెలుగు) జనవరి 18 :** శేరిలింగంపల్లి కొండాపూర్ లోనీ ఓయో రూమ్ లో గంజాయి దుకాణం పెట్టిన ఇద్దరినీ ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు అదుపులోకి తీసుకున్నవారిని కావలికి చెందిన రాజు (25) .మధ్యప్రదేశ్ కి చెందిన సంజన (18) గా గుర్తించిన పోలీస్ అధికారులు అయితే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విల్లిద్దరూ గత కొంత కాలంగా అరకు ప్రాంతాలనుండి గంజాయిని తీసుకువచ్చి ఓయో రూమ్ లో ఉంటూ అమ్మకాలు చేస్తున్నారన్న పక్కా సమాచారం తో దాడి చేసినా అధికారులు వారి వద్ద నుండి 3.625 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై ఎన్డీపీఎస్ ( నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్ స్టాన్స్ ) చట్టం కింద కేసు నమోదు చేశారు అయితే గత కొంత కాలంగా హైదరాబాద్ లో గంజాయి కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ వ్యాపారం వెనుక ఉన్న ముఠా సభ్యుల వివరాలు వేలికి తీసేందుకు దర్యాప్తు కొనసాగుతోందని గంజాయి సరపరా వంటి నేరాలను తీవ్రంగా నిరోధించేందుకు ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సమర్దవంతంగా పని చేస్తున్నారని నగర పౌరులు నేరాలకు సంబంధించిన సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు



నిందితులను పట్టుకున్న పోలీసులు

# ఘనంగా నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జనవరి 18 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాహుదూర్పల్లిలో తెలుగుజాతి కీర్తి మకుటం, తెలుగునేల ముద్దుబిడ్డ, తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి విశ్వ విఖ్యాత నట సార్వభౌమ స్వర్గీయ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం నాడు ఉదయం 11:00 గంటలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం , బహుదూర్పల్లి చౌరస్తా లో అమోగ రెస్టారెంట్ ఎదురుగా గల స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి,కోలన్ శ్రీనివాసరెడ్డి, పాలభి షేకం పూలమాల వేసి ఘననివాళులు అర్పించడం మరియు మెడికల్ క్యాంపులు, అన్నదానం కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్బంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ నాకు మొదటిసారి ఓటు హక్కు వచ్చిన నప్పుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ కి వేసాను అని మహానుభావుడు ఉమ్మడి తెలుగురాష్టానికి మరువలేని సేవలు చేసారని తెలియజేసారు.అదేవిదంగా ఇ కార్యక్రమం నిర్వాహకులు గంజిపల్లి వేణు గోపాల్, జాస్తి సురేష్ బాబు, పుట్టా నరేందర్ కుమార్, ఆధ్వర్యంలో స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి వేడుకలు వైభావంగా జరిగాయి మరియు మెడికల్ క్యాంపులు, వేయి మందికి అన్నదానకార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో కమ్మసంగం బొడ్డు రవిశంకర్, బొడ్డు రంగారావు పరుచూరి శివరాంప్రసాద్, సుంకవల్లి వీరబాబు మరియు నందమూరి అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న రైతులు

**ముధోల్ (మన వెలుగు) జనవరి 18 :** ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు రైతు సంఘం ఏర్పాటు చూసుకోవాలని ప్రముఖులు సూచించారు. రైతు సంఘం ద్వారా పంటల ధరలు పడిపోవడం, సాగు నీటి కొరత, రుణ భారం , విద్యుత్ సరఫరా లో జాప్యం , విత్తనాలు , ఎరువుల లభ్యత వంటి సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను కనుగొంటాయి. రైతుల సామూహిక శక్తిని ఒకే వేదికపైకి తెచ్చి, వారి సమస్యలని గుర్తించి వాటికి పరిష్కారం కనుగొనేందుకు ఏర్పాటు చేయబడిన ఒక సంస్థ. భారతదేశం వంటి వ్యవసాయాధారిత దేశంలో రైతు సంఘాలు రైతుల జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వ్యవసాయ రంగంలో స్థిరత్వం మరియు అభివృద్ధి కోసం రైతు సంఘాలను ఏర్పరచి, వాటిని బలోపేతం చేయడం అత్యంత అవసరం. అందుకు చదువుకున్న యువ రైతులు ఉత్సహముగా ముందరికి వచ్చి ఈ రైతు సంఘము ముధోల్ ఏర్పాటులో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ రైతు చైతన్య కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి అంబిర్ ఆనందరావు, సాయిరెడ్డి , దేవన్న , శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్ , మాజీ ఎంపీటీసీ దేవోజి భూమేష్ , నాయకులూ తటివార్ రమేష్, పిఎసిఎస్ డైరెక్టర్ గోపి పటేల్ , రైతులు సాయిప్రసాద్ జంబుల , రమాకాంత్ పాటిల్ , యోగేశ్ పాటిల్, మేకల సాయినాథ్ యాదవ్ , కందోళ్ళ శంకర్ , సారథి రాంకీ , స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చి కుక్కల దాడిలో పదిమందికి గాయాలు



కుక్కల దాడిలో గాయాలు

**ముధోల్ (మన వెలుగు) జనవరి 18 :** పిచ్చి కుక్కల దాడిలో పలువీధులలో పదిమంది గ్రామస్తులు గాయపడిన ఘటనలు శనివారం ముధోల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామంలోని కోట్ గల్లి, ధోభీ గల్లి, కాల్వ గల్లీకి చెందిన పలువురికి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. క్షతగాత్రులను చికిత్స కోసం బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని వీటి నివారణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు. గతంలో సైతం చిన్నారులు- వృద్ధులపై పిచ్చికుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ప్రధాన వీధుల్లోని కూడలిలో కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. చిన్నారులు -వృద్ధులు -మూగజీవులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. చిన్నారులు ఆరు బయట ఆటలు ఆడడానికి భయపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడద నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వంద మంది నిరుపేదల కడుపు నింపిన ఫుడ్ బ్యాంక్



అన్నదానం చేస్తున్న దృశ్యం

**లోకేశ్వరం (మన వెలుగు) జనవరి 18 :** మండల కేంద్రానికి చెందిన క్రీ. శే. గడ్డం లక్ష్మి రెండవ వర్ధంతి సందర్భంగా వారి కుమారులైన శ్రీ గడ్డం నరసింహ రెడ్డి (మాజీ బ్యాంక్ మేనేజర్) మన ఫుడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేయమని కోరడంతో బైంసా చుట్టుపక్కల మరియు వానల్ పాడ్ గ్రామ ప్రాంతంలో వివిధ ఇటుక బట్టిలలో పనిచేస్తున్న నిరుపేదలకు మహారాష్ట్ర వలస కూలీలకు మరియు ఆంధ్ర ప్రాంతానికి చెందిన శ్రీకాకుళం కు చెందిన వలస కూలీలకు దాదాపు నూట పది మందికి అన్నధానం చేసి ఆకలి తీర్చారు. ఈ కార్యక్రమం ఫుడ్ బ్యాంక్ బైంసా ఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ అన్నదానానికి సహాయం అందజేసిన దాతకు ప్రత్యేక ధన్యవాదములు తెలియపరుస్తూ, అదేవిధంగా పుట్టినరోజులను, పెండ్లి రోజులను వృధా ఖర్చు చేయకుండా ఇలా నిరుపేదలకు అన్నదానం చేయడంతో వారి కడుపు నింపిన వారము అవుతామని వెయ్యిలు ఖర్చు పెట్టి మనం ఒక్కరోజు పొందే ఆనందానికి బదులు ఇలా చేస్తే పేదల ముఖాల్లో ఆనందాన్ని చూడవచ్చని ఆంజనేయులు తెలియజేసారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు 9వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 18 :** అర్హులందరికీ రేషన్ కార్డులు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తొమ్మిదవ వార్డ్ ఇంచార్జ్ వీరభక్తి దశరథం పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గం పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు ఆదేశాల మేరకు చేపట్టిన నూతన రేషన్ కార్డుల సర్వే శుక్రవారం చేపట్టారు, తదనంతరం వీరబత్తిని దశరథం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా, ప్రజల ను మభ్య పెట్టడమే కాకుండా, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిం చడం కరెక్ట్ కాదని పేర్కొన్నారు.

# అలరించిన ఆర్ఎంపీల క్రికెట్ పోటీలు



మెమొంటోలు అందిస్తున్న దృశ్యం

**ముధోల్ (మన వెలుగు) జనవరి 18 :** బైంసా మండలంలోని వానల్పాడ్ గ్రామంలో డివిజన్ స్థాయి ఆర్ఎంపి-పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు అలరించాయి. ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో ఉపశమనం పొందేందుకు క్రీడలే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమకు అనువైన సమయంలో ఇష్టమైన క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. క్రికెట్ పోటీలు చూపరులను విశేషంగా అకట్టుకున్నాయి. డివిజన్లోని వివిధ మండలాల చెందిన ఆర్ఎంపి-పిఎంపీలు క్రికెట్ పోటీల్లో పాల్గొని తమలో అంతర్గతంగా దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో విజేతగా బైంసా ఆర్ఎంపీ అసోసియేషన్ జట్టు నిలిచింది. క్రీడాకారులకు మెమొంటోలను ముఖ్య అతిథులు లైన్స్ క్లబ్ బాసర అధ్యక్షుడు బోస్లే నందకిషోర్ పటేల్, డాక్టర్ ముత్యం రెడ్డి, డాక్టర్ నాగేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి-పిఎంపి డివిజన్ అధ్యక్షులు ఆశమొల్ల మోహన్, జిల్లా అధ్యక్షుడు పోశట్టి, కార్యదర్శి గంధం పోషట్టి, ఆయా మండలాల అధ్యక్షులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీరామచంద్రుని ఆలయం



పూజలో పాల్గొన్న భక్తులు

**ముధోల్ (మనవెలుగు) జనవరి 18 :** ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో మండల పూజను పునస్కరించుకుని శ్రీరామచంద్రుడి ఆలయంలో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. శ్రీకాంత్ నేరడిగొండ ఆధ్యాత్మిక ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో భక్తి గీతాలతో అలంకరణ అభిషేకాలు దీప దూప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా రామాలయ చైర్మన్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ రామాలయం మహా పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందాలని గ్రామస్తుల సహకారం కావాలని కోరడం జరిగింది. తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ దర్శించుకున్నారు. వారికి రామాలయ కమిటీ సభ్యులు, చైర్మన్ సంతోష్ రెడ్డి మెమొంటో అందజేసి సన్మానం చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఇంఛార్జి రావుల గంగారెడ్డి శ్రీరామచంద్రుడిని దర్శించుకున్నారు. ఆయనను రామాలయం కమిటీ సభ్యులు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘ సభ్యులు పాల్గొన్నారు. బాసర వేదపండితులు మురళి పంతులు ఆధ్వర్యంలో సునీల్ గురు స్వామి, ప్రసాద్ స్వామి, ఆనంద్, బ్రహ్మం, ఆలయ కమిటీ కండెల అశోక్, మాజీ ఎంపిటిసి సునీత పోశట్టి, రావుల పోశట్టి, భోజన్న, లక్ష్మారెడ్డి పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల పూజ ఖర్చు-భోజనాలను ఆర్మూర్ సంతోషి రెడ్డి దాతగా నిలిచారు. యూత్ సభ్యులతో నూతన రామాలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఉత్సవ్ కమిటీ అధ్యక్షులుగా లోలం మురళి, సాకలి గంగాధర్, ఉపాధ్యక్షులు కండెల భరత్, సెక్రటరీ ముంగటివారి స్వరాలు, క్యాషియర్ సురుగుల రాము, కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. రావుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరడం జరిగింది. రామాలయం క్యాలెండర్లను ఆవిష్కరించారు.

# వాస్తాపూర్ -పంచ గుడి వరకు రహదారిని విస్తరించాలి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రైతులు

**ముధోల్ (మన వెలుగు) జనవరి 18:** ముధోల్ నుండి 30 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న డబుల్ లైన్ రహదారి పనులు వాస్తాపూర్ వరకే వస్తున్నాయని, అక్కడి నుండి పంచ గుడి వరకు పొడిగిస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని, వీటి కోసం నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కు ఐదు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో అబ్దుల్లాపూర్, జోర్పూర్, వటోలి, ధర్మోరా, పంచగుడి గ్రామాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. ఆయా గ్రామాల సమస్యలపై ఎమ్మెల్యే వారితో గంటపాటు చర్చించారు. రహదారి విస్తరణను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన పైపులైన్ లీకేజీలతో ఇబ్బంది ఎదురవుతుందని, ధర్మోరా చెరువుకు లిఫ్ట్ ద్వారా అనుసంధానం చేయాలని రైతులు కోరారు. అదేవిధంగా పెద్ద చెరువు తూము మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడారు. రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతోపాటు సమస్యలను గ్రామాల వారీగా ఎమ్మెల్యేకు విన్నవించారు. సాగునీటి విషయంలో రాజకీయాలకతీతంగా రైతులు ఏకమైతే, మరింత అభివృద్ధి సాధించగలుగుతామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో రైతు సంఘాలు దృష్టి సారించగలిగితే సాగునీటి రంగం చెందుతుందన్నారు. లోకేశ్వరం మండల బిజెపి అధ్యక్షులు సాయన్న, మాజీ ఎంపీపీ మంద లింగన్న, తో పాటు పెద్ద మొత్తంలో ప్రజలు ఉన్నారు.

# రైతు సంస్థ ద్వారా రైతులకు అనేక లాభాలు



మురళి ఫైల్ ఫోటో

**ముధోల్ ( మన వెలుగు) జనవరి 18 :** బాసర మండలంలోని కిర్గుల్ గ్రామంలో మహిళా అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జాజున మురళి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం ప్రతి రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. గతంలో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన శ్రీ జ్ఞాన సరస్వతి ఎఫ్పిసిఎల్లో గ్రామానికి చెందిన 38 మంది రైతులు సభ్యులుగా చేరి, పైపులు, యూరియా, మందులను అందించుకున్నారని తెలిపారు. అదేవిధంగా రైతులు కొంత లాభాన్ని పొందారని వివరించారు. రైతు సంఘం సభ్యులుగా ప్రతి ఒక్కరూ చేరి రైతు బజార్లు వంటి సేవలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పోతన్న మాట్లాడుతూ రైతుల అవసరాలను తీర్చే విధానంపై చర్చించారు. ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వర్ మాట్లాడుతూ, ఎఫ్పిసిఎల్ లో సభ్యత్వం పెంచడం, ఎస్ఎఫ్ఎసి నిధులను సమర్థంగా ఉపయోగించడం ద్వారా వ్యాపారాన్ని విస్తరించాలని పిలుపునిచ్చారు. జిల్లా సమన్వయకర్త ప్రవీణ్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు పారిశుధ్యంపై దృష్టి పెట్టి, మరుగుదొడ్ల మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు విజయ్, సీఈఓ పవన్, అకౌంటెంట్ రాజు, రైతులు పాల్గొన్నారు.